సాక్షి
నిజామాబాద్


ఆదివారం । 23 । మార్చి । 2025



భవిష్యత్‌లో సోలార్..

భవిష్యత్‌లో సోలార్ విద్యుత్‌కు మంచి డిమాండ్ ఉంటుందని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు.

- 8లో ▸



ఇఫ్తార్ ఆది : 6:34 | సహర్ సోమ : 4:55

రంజాన్ వేళలు

గరిష్టం/కనిష్టం 36.7 /20.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

బంతి బంతికీ బెట్టింగ్

క్రికెట్‌పై ఉన్న అభిమానం వ్యసనంగా మారింది. 20 ఓవర్ల మ్యాచ్ కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. చేతిలో ఉన్న 'స్మార్ట్' ఫోన్‌లోని యాప్‌లు యువతను బెట్టింగ్ ఊబి లోకి దించుతున్నాయి. బంతి బంతికి బెట్టింగ్ కాస్తున్న యువత అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కుటుంబ సభ్యులనూ బలి తీసుకుంటు న్నారు. శనివారం నుంచి ఐపీఎల్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతు న్నారు. బంతి బంతికో బెట్టింగ్ కథ వినిపి స్తోంది.

ప్రారంభమైన ఐపీఎల్

- రంగంలోకి దిగిన బెట్టింగ్ రాయుళ్లు
- కొంపలు ముంచుతున్న యాప్‌లు
- బలవుతున్న కుటుంబాలు
- ఇదో 'స్మార్ట్' వ్యసనం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఐపీఎల్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ యాప్‌లు మరింత విజృంభి స్తున్నాయి. అదృష్టం కలిసి వస్తుందని, తేలికగా డబ్బు సంపాదించుకోవచ్చనే అత్యాశతో పలువురు బెట్టింగ్ రాయుళ్లు బయల్దేరారు. బెట్టింగ్ వైపు యువతను, క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఐపీఎల్‌కు సంబంధించి ప్రతి బంతికి బెట్టింగ్ చేసేలా యాప్‌లు పకడ్బం దీగా కథ నడిపిస్తున్నాయి. డాట్ బాల్ మొదలు, సింగిల్ రన్, ఫోర్, సిక్సర్, వికెట్ అంటూ బంతిబం తికీ ప్రత్యేకంగా కథ నడిపిస్తున్నారు. బెట్టింగ్‌కు సం బంధించి అందుబాటులో ఉన్న యాప్‌లను, లిం కుల ద్వారా పంపి టెంప్ట్ చేస్తున్నారు. బెట్టింగ్ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లతోపాటు వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా జిల్లాలో బెట్టింగ్ నడిపిస్తున్నారు. రెగ్యులర్‌గా రమ్మీ, స్కిల్ గేమ్స్ వంటివి ఆడిన వారు తాజాగా ఐపీఎల్ బెట్టింగ్‌లోకి దిగుతున్నారు. అంతా చేతిలోని స్మార్ట్ ఫోన్‌తోనే కావడంతో జిల్లాకు చెందిన అనేకమంది వయస్సుతో సంబం ధం లేకుండా బెట్టింగ్ ఊబిలోకి దిగుతున్నారు. క్రమంగా ఇది వ్యసనంగా మారుతోంది. బెట్టింగ్‌ల కోసం అప్పులు చేస్తుండడంతో అనేక కుటుంబాలు రోడ్డుపైకి వస్తున్నాయి. మానసికంగా కుంగిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అప్పులు ఇచ్చిన వారిని తీసుకున్నవారు విషపు ఇంజక్షన్లు ఇచ్చి హతమార్చిన ఘటనలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని గోదావరి జిల్లాల్లో వెలుగు చూశాయి. అయి నప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం తో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

తెలంగాణలో బెట్టింగ్ నిషేధిత చట్టం చేసినప్పటికీ..

తెలంగాణ ప్రభుత్వం 2015లోనే బెట్టింగ్ నిషేధిత చట్టాన్ని చేసిం ది. అయినప్పటికీ హైదరాబా ద్‌తోపాటు అన్ని జిల్లాల్లో బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సై ట్ల హవా విచ్చలవిడిగా నడుస్తోంది. ఇక పక్కనే ఉన్న ఏపీలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలో బెట్టింగ్ యాప్‌ల నిషేధ చట్టం చేశారు. అయితే తాజాగా వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ బెట్టింగ్ యాప్‌లకు స్వాగతం పలికేలా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం చేసిన నిషేధాన్ని ఎత్తేసి మరీ అనుమతులు ఇవ్వడం గమ నార్హం. తెలంగాణలో మాత్రం బెట్టింగ్ యాప్‌లపై నిషేధం ఉంది.

సెలబ్రిటీల ప్రమోషన్ కూడా కారణమే..

అనేక రకాల బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లను ప్రమోట్ చేసినవారిలో స్టార్ క్రికెటర్లు, బాలీ వుడ్ యాక్టర్లు, తెలుగు నటీనటులు ఉన్నారు. దీంతో సహజంగానే బెట్టింగ్ యాప్‌లకు ఆక ర్షితులయ్యేవారి సంఖ్య పెరిగింది. ధోని, సచిన్ టెండూల్కర్, దినేశ్ కార్తీక్, విరాట్ కోహ్లి వంటి క్రికె టర్లు, నటులు షారుఖ్‌ఖాన్, సోనూసు ద్, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, రాణా, మంచు లక్ష్మి తదిత రులు, బాలకృష్ణ నిర్వహించే అన్‌స్టాప బుల్ షో ద్వారా బెట్టింగ్ యాప్‌ల గురించి భారీగా ప్రమోట్ చేయడంతో పలువురు ఆకర్షితులయ్యారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన 25 మంది సెలబ్రిటీలపై కేసులు నమోదయ్యాయి. జిల్లాలోనూ బెట్టింగ్ యాప్‌లపై ప్రత్యేక దృ ష్టి సారించామని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు.



ఖలీల్‌వాడి: బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ పోతరాజు సాయిచైతన్య హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పర్యవసనంతో ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బలవన్మరణం చెందిన కేసును పునఃపరిశీలిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈజీ మనీ వస్తుందనే ఆశతో 23 ఏళ్ల ... మారడంతోనే ఈ ఘటన చోటు చేసుకుంద న్నారు. బెట్టింగ్‌లో నష్టపోతూ కుటుంబంపై అప్పుల భారం పెరగడంతో మానసిక బాధతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును మొదట ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడిగా నమోదు చేశామని, కానీ, ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని, సామాజిక ప్రమాదమని చెప్పారు. వడ్డేపల్లి ఘటనను సీరియస్‌గా తీసుకు న్నామని, అసలు కారణాలపై దర్యాప్తు జరిపి, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో బెట్టింగ్ యాప్ లకు యువకులు, ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్ మాఫియాపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

బెట్టింగ్ మాఫియాపై ప్రత్యేక దృష్టి

- వడ్డేపల్లి కుటుంబ బలవన్మరణం కేసు పునః పరిశీలన
- సీపీ పోతరాజు సాయిచైతన్య



మొదట్లో డబ్బులు వచ్చేలా చేస్తారు

యాప్‌లు, వెబ్‌సైట్లలో బెట్టింగ్ చేసే వారిని మొదట డబ్బులు గెలుచుకునేలా చేస్తారు. తరువాత లక్షల్లో డబ్బులు గుంజు తారు. వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే బెట్టింగ్ లింక్‌లకు టెంప్ట్ కాకుండా ఉంటే మంచిది. తెలంగాణ ప్రభుత్వం 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లకు నోటీసులిచ్చింది. ప్రతిఒక్కరూ ఈ బెట్టిం గ్ యాప్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండి, వాటిబారిన పడకుండా ఉండాలి. – రాజావెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

న్యూస్‌రీల్

దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలి

- రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని రాష్ట్ర రైతు కమి షన్ సభ్యుడు గడుగు గంగాధర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించా రు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడు దల చేశారు. యా సంగిలో సాగుచేస్తున్న పంటలు, అందులో వడగళ్ల వానకు దెబ్బతి న్న వాటి వివరాలు సేకరించాలని తెలిపా రు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేశారని పేర్కొ న్నారు. వ్యవసాయ కమిషన్ రైతులకు అం దుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



నిజామాబాద్‌నాగారం: అంతర్జాతీయ స్థా యి సాఫ్ట్‌బాల్ టోర్నీకి ఎంపికైన క్రీడాకారిణి కీర్తనను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం తన చాంబర్‌లో అభినందిం చారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు తైవాన్ దేశంలో సాఫ్ట్‌బాల్ చాంపియన్ పో టీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రా ష్ట్రం నుంచి నలుగురు ఎంపికకాగా, వారిలో జిల్లాకు చెందిన కీర్తన ఉన్నారు. కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కీర్త నకు అభినందనలు తెలిపారు.

ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ

సుభాష్‌నగర్ : ఉగాది నుంచి రేషన్ దుకా ణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని డీ ఎం శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్ లోని డీఎస్‌వో కార్యాలయంలో అధికారు లు, రేషన్‌డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మా ట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి కార్డుదారుడికి సన్నబియ్యం పంపిణీ చేయాలన్నారు. దుకా ణాల్లో మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని పం పిణీ చేయొద్దన్నారు. ఎక్కడైనా దొడ్డు బి య్యం పంపిణీ చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమా వేశంలో ఏఎస్‌వో రవిరాథోడ్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

39 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు రెండోరోజు శనివారం ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 141 కేంద్రాల్లో నిర్వహించిన హిందీ పరీక్షకు 22,724 మంది విద్యార్థులకుగాను 22,685 మంది హాజరుకాగా, 39 మంది గైర్హాజర య్యారు. డీఈవో అశోక్ పలు పరీక్షా కేం ద్రాలను తనిఖీ చేశారు.

వేయి ఎకరాల్లో పంట నష్టం

- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా



సిరికొండ మండలం కొండూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో కురిసిన అకాల వర్షానికి 1,036 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నెల 20, 21 తేదీల్లో సిరికొండ, ధర్పల్లి, ఇం దల్వాయి, సాలూర, నవీపేట్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం, వడగళ్లు పడిన విషయం తెలిసిందే. వ్యవసాయాధికారులు శని వారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. వరికి ఎక్కువ నష్టం వాటిల్లగా, మొక్కజొన్న స్వల్పంగా దెబ్బతిన్నది. రాళ్ల వానకు ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో 185 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. 1,036 ఎకరాల్లో 33 శాతానికి మించి దెబ్బతిన్న పంటలు 884 ఎకరాల్లో గుర్తించగా, 1,033 మంది రైతులు నష్టపోయినట్లు అంచనా వేశారు. కాగా, 33 శాతానికి మించి పంటకు నష్టం జరిగితేనే ప్రభుత్వం నుంచి రైతులకు నష్ట పరిహారం వచ్చే అవకాశం ఉంటుంది.

రామాలయానికి రూ.20కోట్లు ఇవ్వండి



సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: అసెంబ్లీ సమావేశాల్లో శనివారం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పలు అం శాలపై మాట్లాడారు. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న రఘు నాథాలయం (ఖిల్లా) అభివృద్ధికి రూ.20కోట్లు కేటాయించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బాసర సరస్వతి ఆ లయ టూరిజం సర్క్యూట్‌లో డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని చేర్చాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రభు త్వాన్ని కోరారు. ఖిల్లా రామాలయంలో గతంలో అంగరంగ వైభవం గా ధూపదీప నైవేద్యాలు, పూజలు, సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగేవని, నేడు శిథిలావస్థకు చేరిందని తెలపడం బాధగా ఉందని ధన్‌పాల్ అన్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరు, శ్రీరామ కల్యాణవేదిక, దాశరథి మందిరం, గుడి గోపురం, పైకప్పు, గోడల మరమ్మతులు, మౌలిక సౌకర్యాల కల్పనకు కనీసం రూ.20కోట్లు స్పెషల్ ఫండ్ మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ఎకో టూరిజం అభివృద్ధి చేయాలి



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం డెవలప్ చేయొచ్చని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. అలాగే నిజాంసాగర్, రామడుగు ప్రాజెక్టుల్లో వాటర్ స్పోర్ట్స్ అడ్వెంచర్ టూరిజం ఏర్పాటు చేయొచ్చని పేర్కొన్నారు. జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, రామడుగు, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను బాసర సర్క్యూట్‌లో కలిపి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నూతన బిల్లులో వీటిని చేర్చాలని విన్నవించారు.

25న 'గిరిరాజ్'లో ఉద్యోగమేళా

- తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశా లలో ఈనెల 25వ తేదీన ఉద్యోగమేళా నిర్వహించను న్నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులతోపాటు శ్రీ చైతన్య పాఠశాల/కళాశాలల ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 30ఏళ్లలోపు వయస్సు ఉండి, అర్హులైన అభ్యర్థులు తమ విద్యాభ్యాసానికి సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచ చేసు కోవాలని పేర్కొన్నారు.

అందరూ పన్ను చెల్లించాల్సిందే..

- ఎవరికీ మినహాయింపు ఉండదు
- తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నాం
- వీధి లైట్ల సమస్యను పరిష్కరిస్తాం
- డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం
- సాక్షి 'ఫోన్ ఇన్'లో నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్



నిజామాబాద్ నగరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మా రిందని, డ్రెయినేజీ లను శుభ్రపర్చడం, పిచ్చి మొక్కలను తొలగించడం లేదని నగరా నికి చెందిన పలు వురు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు సమస్యలను ఏకరువు పెట్టారు. మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్‌తో శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించగా, నగరవా సులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉద యం 10 నుంచి 11 గంటల సాక్షి ఫోన్ ఇన్ కొనసాగగా, సుమారు 58 మంది ఫోన్‌లు చేసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యలను విన్న కమిషనర్ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. – నిజామాబాద్ సిటీ

■ నీటిపన్ను ఒకేసారి రూ.7 వేలు కట్టమంటే ఎట్లాసా ర్.. ఐదేళ్ల నుంచి ఒక్కసారి అడగని అధికారులు ఇప్పుడు అకస్మాత్తుగా ఆరేళ్లకు సంబంధించి నీటి పన్ను కట్టమంటే ఎట్లాసార్..
– రాజ్‌కుమార్, ఖానాపూర్

మున్సిపల్ కమిషనర్ : నీటి పన్ను కూడా వెంటవెం టనే చెల్లించాలి. పెండింగ్‌లో ఉంచొద్దు. ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించకుంటే ఎట్లా.. మున్సి పల్ నీటిని వాడుకుని పన్ను కట్ట కుంటే ఎలా? మొత్తం బిల్లు చెల్లిం చాల్సిందే. ఎలాంటి మినహాయింపు ఉండదు.

■ పోచమ్మగల్లీలో తాగునీరు సరిగా రావడం లేదు. పైప్ లైన్ల మరమ్మతులు చేపట్టడం లేదు. బోర్‌లు పనిచేయడం లేదు. బల్దియా సరఫరాచేసే తాగునీరు సరిపోవడం లేదు. అరగంట ఎక్కువసేపు నీరు సరఫరా చేయాలి. దుబ్బ ముస్లిం బస్తీలో నీరు సరిగా రావడం లేదు.
– గణేశ్ గౌతంనగర్, నాగరాజు పోచమ్మగల్లీ, లింబాద్రి బోర్గాం (పి), మాజిద్ మాలపల్లి, ధన్‌రాజ్ పోచమ్మగల్లీ, నూర్‌మహ్మద్ దుబ్బ, రవికుమార్ ఆదర్శనగర్.

మున్సిపల్ కమిషనర్: అవసరమైన చోట్ల పైప్ లైన్‌ల మరమ్మతులు చేయిస్తాం. తాగునీరు సరిపోకపోతే ఫ్లో పెంచుతాం. అసలు నీరు సరఫరాకాని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. నీటిని వృథా చేయొద్దు. జాగ్రత్తగా కాపాడుకోవాలి. మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డికి ఆదేశాలు జారీచేశాం.

■ నగరంలోని బోర్గాం (పి), ఆనంద్‌నగర్, సాయి నగర్–2, దుబ్బ, బురుడుగల్లీ తదితర ప్రాం తాల్లో డ్రెయినేజీలను శుభ్రపర్చడం లేదు. దోమలు వ్యాపిస్తున్నాయి. సిబ్బంది చెత్త సేకర ణకు ప్రతిరోజూ రావడం లేదు. శానిటరీ ఇన్ స్పెక్టర్ స్పందించడంలేదు.
– సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, బోర్గాం (పి), సుకన్య మిర్చి కాంపౌండ్, జానకి రాధాకృ ష్ణ థియేటర్ ఎదురు గల్లీ, సుదర్శన్‌రెడ్డి ఎల్లమ్మ గుట్ట, బ్యాంక్‌కాలనీ, ఎం విజయ్ మిర్చి కం పౌండ్, రమణిస్వామి నాగారం, రాజశేఖర్ ఖానాపూర్, సాలుగారి మోహన్ భాగ్యనగర్ కాలనీ, ఖానాపూర్, నవీన్ బురుడుగల్లి, భాజన్న ఆనంద్‌నగర్ కాలనీ, అక్బర్ సారంగా పూర్)

మున్సిపల్ కమిషనర్ : సమస్య పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంహెచ్‌వో జయకుమార్‌కు ఆదేశాలు జారీచేశా. ఆదివారం ఉదయమే బోర్గాం(పి)లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. డ్రెయినేజీ లను శుభ్రపరుస్తారు.

■ వినాయక్‌నగర్ ప్రాంతంలోని 100 ఫీ ట్ల రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదు. పాంగ్రా, మాధవనగర్, ముబారక్‌నగర్, కేసీఆర్ కాలనీ, చంద్రశేఖర్ కాలనీల్లోనూ వీధిలైట్లు సరిగా వెలగడం లేదు. రాత్రివేళ బయటకు వెళ్లాలంటే పిల్లలు భయపడుతు న్నారు.
– రమేశ్ బొబ్బిలివీధి, శ్రీనివాస్ ప్రగతినగర్, రవీందర్ స్కాలర్స్ స్కూల్, విఠల్ వంద ఫీట్ల రోడ్డు, శ్రీనివాస్‌రెడ్డి కోజా కాలనీ

మున్సిపల్ కమిషనర్: వీధిలైట్ల మెయిం టెనెన్స్‌ను ప్రభుత్వం ఓ ఏజెన్సీకి ఇచ్చిం ది. కొన్ని చోట్ల ఇబ్బందులున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

■ రూ.వెయ్యి, రెండువేల పన్ను చెల్లించాల్సి ఉన్నా అధికారులు వేధిస్తున్నారు. ఫోన్‌లు చే సి మరీ అడుగుతున్నారు. పెద్ద మొత్తంబకా యిలు ఉన్న వారిని ఎందుకు వదిలివేస్తున్నా రు. అందరికీ ఒకే న్యాయం ఉండాలి సార్..
– రాజరత్నం వినాయక్‌నగర్, అశోక్ వినాయక్‌నగర్, రాజమణి వీక్లి మార్కెట్)

మున్సిపల్ కమిషనర్ : అందరూ పన్నులు చెల్లించాల్సిందే. ఎవరికీ మినహాయింపు ఉం డదు. పన్ను చెల్లిస్తేనే సేవలను సరిగా ఇవ్వగ లుగుతాం. మీరు కట్టే పన్నుతోనే తాగునీరు, పారిశుధ్య పనులు, ఇతర సేవలు అందించ గలుగుతాం. బాధ్యతగల పౌరులు పన్నులు వెంటనే చెల్లించాలి. పన్ను చెల్లించని వారిని ఉపేక్షించేది లేదు. దుకాణాలు సీజ్ చేస్తు న్నాం. జరిమానాలు విధిస్తున్నాం.

క్లుప్తంగా

సీపీని కలిసిన బీజేపీ నాయకుడు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

బార్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఎన్నిక అధికారులు వెంకటేశ్వర్, ఆర్ఎస్ఎల్ గౌడ్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ ఎన్నికల కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు. ఈ 26వరకు నామినేషన్‌పత్రాలను స్వీకరిస్తామని వారు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: రాజీవ్ యువ వికాసంలో భాగంగా గిరిజన యువత స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఏప్రిల్ 5లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులను కలెక్టరేట్‌లోని సంబంధిత కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రైతన్నను ఆగం చేసిన వాన

- వడగండ్లతో దెబ్బతిన్న వరి పంట
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



మద్దుల్ తండాలో రాలిపోయిన వరి గింజలను చూపిస్తున్న రైతు దంపతులు

■ ధర్పల్లి మండలం మద్దుల్‌తండాకు చెందిన రైతు గోవింద్ 2 ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట కోతదశకు వచ్చినప్పటికీ తన అన్న చనిపోవడంతో ఇంట్లో నుంచి బయటకు రాలేక వరి కోతలు రెండు రోజులు వాయిదా వేసుకున్నాడు. శుక్రవారం కురిసిన వడగళ్లకు పూర్తిగా వరి గింజ నేలరాలిపోయింది. పొలం కోసం రూ. 60వేలు పెట్టుబడి పెట్టగా, మరో రెండు రోజుల్లో కోతలు మొదలుపెట్టేలోపే వర్షం వల్ల పంట నష్టపోయాడు. పంట చేతికొచ్చే సమయంలో నేలపాలు కావడంతో అతడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు వ్యవసాయమే జీవనాధారం అని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని గోవింద్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.



హోన్నాజీపేటలో పూర్తిగా నేలకు ఒరిగిన వరి పైరు

ధర్పల్లి: జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వాన రైతులను ఆగమాగం చేస్తూ తీరని నష్టాన్ని మిగిల్చింది. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానకు ధర్పల్లి, సిరికొండ మండలాల్లోని వరి పంట దెబ్బతింది. మరో రెండు మూడు రోజుల్లో వరి కోతలు ప్రారంభించనున్న సమయంలో అకాల వర్షం కురవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడగళ్ల వానల దాటికి వరి పంటలు నేలమట్టమయ్యాయి. మరికొన్నిచోట్ల భారీ గాలులకు పంట నేలకు ఒరిగిపోయింది. ధర్పల్లి మండలంలోని మద్దుల్‌తండా, హోన్నాజీపేట్, వాడీ, సీతాయిపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలో వడగండ్ల వానకు 174 మంది రైతులకు సంబంధించి 265 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. సిరికొండ మండలం కొండూర్, చీమన్‌పల్లి, చిన్నవాల్గొట్ గ్రామాల పరిధిలో 700 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. పంట చివరి దశలో భూమిపాలు కావడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న పంటపొలాల పరిశీలన



సీతాయిపేట్ శివారులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ధర్పల్లి/సిరికొండ: వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను శనివారం ఏడీఏ ప్రదీప్ కుమార్, ఏవో వెంకటేష్, నర్సయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్పల్లి మండలంలోని హోన్నాజిపేట్, వాడీ, మద్దుల్ తండా, సీతాయిపేట్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి, నమోదు చేశారు. ధర్పల్లి మండలంలో 174 మంది రైతులకు చెందిన 265 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు వారు తెలిపారు. అలాగే సిరికొండ మండలంలోని కొండూర్, చిన్నవాల్గోట్, చీమన్‌పల్లి, సిరికొండ గ్రామాల్లో సుమార 700–750 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.

పంట నేలరాలిపోయింది..

ఈ యాసంగిలో ఆరున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. కానీ ఇటీవల కురిసిన వడగండ్లకు ఆరున్నర ఎకరాల్లో ఒక్క వరి గింజ కూడా లేకుండా పూర్తిగా నేలరాలిపోయింది. ఇప్పుడు పచ్చి గడ్డి తప్ప ఏమి లేదు. రూ.1.80 లక్షల పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వస్తుందని ఆశిస్తే వడగళ్ల వర్షానికి పంట మొత్తం నేలపాలయింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి

–మోహన్ రెడ్డి, రైతు, వాడి

టీజీన్యాబ్ శిక్షకుడిగా జిల్లా వాసి



కమ్మర్‌పల్లి/ ఖలీల్‌వాడి: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్‌కు చెందిన ఉట్నూర్ నరేశ్ ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్ కమిషనర్‌రేట్, టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ అనే అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా యాంటీ సోల్జర్‌గా పనిచేసేందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ శిక్షకుడు, ఆర్మూర్ ఐసీఐ ఫౌండర్ ప్రెసిడెంట్ నరేశ్‌ను ఎంపిక చేశారు.

24 నుంచి సబ్జెక్టుల మూల్యాంకనం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సబ్జెక్టుల మూల్యాంకనం ఈనెల 24 నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24న ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని అన్నారు. సంబంధిత సబ్జెక్టుల అధ్యాపకులు ఆర్డర్ కాపీలతో మూల్యాంకనానికి హాజరు కావాలని కోరారు.

భవిష్యత్‌లో సోలార్ విద్యుత్‌కు డిమాండ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

సుభాష్‌నగర్: భవిష్యత్‌లో సోలార్ విద్యుత్‌కు మంచి డిమాండ్ ఉంటుందని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లాలో కొత్తగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకునే రైతులు, మహిళలు, యువకులు, వ్యాపారవేత్తలు అవగాహనతోనే ముందుకెళ్లాలని తెలిపారు. నగరంలోని పవర్‌హౌజ్ పరిధిలో గల గోల్డెన్ జూబ్లీ మీటింగ్ హాల్‌లో శనివారం టీజీ ఎన్‌పీడీసీఎల్, టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కుసుమ్ యోజన పథకంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహికులు సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసి విద్యుత్‌శాఖకు యూనిట్ల రూపంలో విక్రయించడంతో ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన సాంకేతిక విషయాలు, బ్యాంకు రుణాలకు సంబంధించి వివరాలు తెలియజేశారు. ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్, టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ రమణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహన్, డీఈలు అల్జాపూర్ రమేష్, వెంకట రమణ, ఉత్తం జాడే, మహ్మద్ ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మారుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

డిచ్‌పల్లి: నిజామాబాద్‌ను క్షయరహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన టీబీ ముక్త్ గ్రామ పంచాయత్ కార్యక్రమంలో భాగంగా శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతా సదన్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లాలో 11 గ్రామ పంచాయతీలను క్షయరహిత (టీబీ ముక్త్) గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో టీబీ నిర్మూలన దిశగా పని చేస్తున్నామన్నారు. సమావేశంలో టీబీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఎంపీవోలు రామకృష్ణ, రాజేశ్, కిరణ్, రాజాఖాన్, తారాచంద్, పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయరహిత గ్రామాలివే..

పడకల్, లక్ష్మాపూర్, పాల్దా, ముల్లంగి(బి), గంగరమంద, పోతన్నూర్, తాళ్లరామడుగు, అబ్బాపూర్ (ఎం), సుంకెట్, వడ్యాట్, మల్కాపూర్ తండా.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



రావుట్లలో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

సిరికొండ: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్ తెలిపారు. సిరికొండ మండలం రావుట్ల, న్యావనంది గ్రామ 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. రావుట్ల గ్రామంలో ఇళ్లు, వ్యవసాయానికి ఒకే బ్రేకర్ ఉండడంతో సరఫరాలో సమస్య వస్తే మొత్తం ఫీడర్ లైన్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో వినియోగదారులకు అసౌకర్యం కలుగుతోందని, సమస్య నివారణకు కొత్తగా మరో బ్రేకర్ ఏర్పాటు చేశామన్నారు. న్యావనంది సబ్‌స్టేషన్‌లో నర్సింగ్‌పల్లికి కొత్త బ్రేకర్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డీఈ ఉత్తమ్ జాడే, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ చంద్రశేఖర్, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, డీలర్ రమేశ్, భాస్కర్, సామెల్, గంగారెడ్డి, దాసు, ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ ముత్తెన్న, నరేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ బాలచంద్రం ఉన్నారు.

'జై బాపు–జై భీమ్–జై సంవిధాన్' బాధ్యుల నియామకం

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి నిర్వహించనున్న పలు సమావేశాలు–పాదయాత్రల నిర్వహణకు మండల బాధ్యులను నియమించారు. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి 34 మండలాలకు పలువురు పార్టీ నేతలను నియమించారు. కమ్మర్‌పల్లి–తారాచంద్, మెండోరా–ఎల్లా సాయారెడ్డి, బాల్కొండ–విబి వేణురాజ్, ఏర్గట్ల–మార గంగారెడ్డి, భీంగల్– గోపి రామర్తి, వేల్పూర్–మార చంద్రమోహన్, మోర్తాడ్–భాస్కర్‌రెడ్డి, ముప్కాల్–బొబ్బిలి రామకృష్ణ, బోధన్–ముప్ప గంగారెడ్డి, బోధన్ టౌన్–ఇర్ఫాన్ అలీ, సాలూర–సంతోష్, ఎడపల్లి–కెతావత్ యాదగిరి,నవీపేట్– అంతిరెడ్డి రాజారెడ్డి, రెంజల్–సుమన్, ఆర్మూర్, ఆలూరు –మునిపల్లి సాయిరెడ్డి, ఆర్మూర్ టౌన్–శేఖర్‌గౌడ్, నందిపేట్–రమేష్‌రెడ్డి, డొంకేశ్వర్–పంచరెడ్డి చరణ్, మాక్లూర్–చంద్రు నాయక్, సిరికొండ–శివకుమార్, ధర్పల్లి–రాజ నరేందర్‌గౌడ్, ఇందల్‌వాయి–తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్–విపుల్‌గౌడ్, జక్రాన్‌పల్లి–నరాల రత్నాకర్, డిచ్‌పల్లి–ప్రితమ్, మోపాల్–ఏరంటి లింగం, చందూర్–శ్రీనివాస్, రుద్రూర్, వర్ని–గంగా శంకర్, కోటగిరి–జావేద్ అక్రం, పోతంగల్–అల్లె రమేష్, మోస్రా–విజయ్‌పాల్‌రెడ్డిని నియమించారు.

ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాల పరిశీలన



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సీపీ సాయి చైతన్య శనివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే నిర్మల హృదయ స్కూల్‌లో జరిగే స్పాట్ వాల్యూయేషన్‌ను పరిశీలించారు. టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ (30 రోజులు), బ్యూటీ పార్లర్ (30 రోజులు) కోర్సుల్లో శిక్షణతోపాటు ఉచిత భోజన, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19నుంచి 45ఏళ్లలోపు ఉన్న గ్రామీణ మహిళలు మాత్రమే శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల మహిళలు డిచ్‌పల్లిలోని టీటీడీసీ పక్కన ఉన్న ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 08461–295428ను సంప్రదించాలని తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



గజారం మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్–పోచంపాడ్ గ్రామాల మధ్యగల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గజారం(32) మూడేళ్ల క్రితం కూలీ పనుల కోసం మెండోరా మండల కేంద్రానికి వచ్చాడు. ఈక్రమంలో శనివారం ఉదయం బుస్సాపూర్ నుంచి పోచంపాడ్ వైపు జాతీయ రహదారి 44పై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు మెండోరా ఎస్సై నారాయణ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన శంకర్(32) కూలీ పని కోసం కొన్ని నెలల పచ్చలనడ్కుడకి వచ్చాడు. మహారాష్ట్రకు చెందిన బాలాజీ అనే వ్యక్తితో కలిసి ఒకే గదిలో నివాసముంటూ గ్రామంలో కూలీ పనులు చేసేవారు. గురువారం రాత్రి ఇద్దరు గొడవ పడగా చుట్టుపక్కల వారు సర్దిచెప్పారు. శనివారం ఉదయం వారి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి ఇంట్లో చూడగా శంకర్ మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. మరో వ్యక్తి బాలాజీ లేకపోవడం, మృతుడి వివరాలు తెలిపేందుకు ఎవరూ లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సందర్శించారు.

చేపల వేటకు వెళ్లి..



సాయిలు (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మంచిప్ప గ్రామానికి చెందిన సుంకరి సాయిలు (55), దండ్ల శ్రీను శుక్రవారం సాయంత్రం గ్రామంలోని కొండెం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. సాయిలు చెరువులోకి దిగగా, శ్రీను కట్టపై ఉన్నాడు. చెరువులోకి దిగిన సాయిలు బురదలో కూరుకుపోయి ఊపిరాడక మునిగిపోయాడు. విషయాన్ని శ్రీను కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాయిలు కోసం గాలించగా, శనివారం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సాగర్ కాలువలో పడి..



సుభాష్ (ఫైల్)

రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో పడి మృతిచెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. రాయకూర్ గ్రామానికి చెందిన మాగిరి సుభాష్ (40)కు గతంలో యాక్సిడెంట్ కావడం వల్ల కాలు విరిగి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈనెల 19న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సుభాష్ తిరిగి రాలేదు. 21న రాత్రి సులేమాన్ నగర్ శివారులోని సాగర్ కాలువలో అతడి మృతదేహం లభ్యమైంది. సుభాష్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా, ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..



దినేష్ (ఫైల్)

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పద్మ దినేష్ (52) మండల కేంద్రంలో ఆధార్, మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దుకాణ పని నిమిత్తం అతడు బైక్‌పై శుక్రవారం కామారెడ్డి వెళ్లి, సాయంత్రం తిరుగుపయనమయ్యాడు. గొల్లపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి అతడు కింద పడగా, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో దినేష్‌తోపాటు ఆటోలో ఉన్న పెద్దబోయిన లింబాద్రి, అతడి భార్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దినేష్ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

జిల్లా కోర్టు ఎదుట ఒకరి ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు గేటు ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన నర్సింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి తండ్రి వ్యవసాయశాఖలో ఉద్యోగిగా పని చేస్తున్న సమయంలో మృతి చెందాడు. నర్సింగ్, కిరణ్ ఇద్దరు అన్నదమ్ములు కాగా, కిరణ్ కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారు. దీంతో కిరణ్ నుంచి తనకు రూ.లక్ష ఇప్పించాలని జిల్లా కోర్టు ఎదుట నర్సింగ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గతంలో ఇలాగే హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫైనాన్స్ వాళ్లు ఆటోను తీసుకువెళ్లారని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. కోర్టు ఎదుట ఆత్మహత్యకు యత్నించడంతో నర్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ధర్మారావ్‌పేట్‌లో ఒకరి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన సుంకరి శంకర్(51) ఇంటి పరిస్థితి బాగా లేక గతంలో అప్పులు చేశాడు. అప్పులను తీర్చే మార్గం లేక శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడు, భార్య లక్ష్మి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

చోరీ చేశారు.. వైరల్ అవడంతో వదిలేశారు..



మోర్తాడ్: గుర్తుతెలియని దుండగులు పొక్లెయిన్‌ని చోరీ చేయగా, ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వాహనాన్ని వదిలేశారు. వివరాలు ఇలా.. భీమ్‌గల్ మండలం జాగిర్యాల్‌లో చిన్నోల్ల గంగాప్రసాద్ తన పొక్లెయిన్‌ని శుక్రవారం రాత్రి ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో నిలిపి ఉంచారు. శనివారం ఉదయం లేచి చూసేసరికి పొక్లెయిన్ కనిపించకపోవడంతో డ్రైవర్ తీసుకువెళ్లి ఉంటాడని భావించాడు. అంతలోనే డ్రైవర్ రావడం పొక్లెయిన్‌ను తాను తీసుకపోలేదని వెల్లడించడంతో చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో పొక్లెయిన్‌ని దొంగలు వేల్పూర్ మండలం పడగల్ క్రాస్‌రోడ్డు వద్ద పొదల్లో నిలిపి ఉంచగా, స్థానికులు గమనించి వాహన యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో పొక్లెయిన్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గుర్తించడానికి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం!

- రూ.2.50లక్షలు చోరీ చేసిన నిందితుడు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

లింగంపేట(ఎల్లారెడ్డి): పని కోసం వచ్చిన ఓ వ్యక్తి, ఆశ్రయమిచ్చిన ఇంట్లోనే చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని నల్లమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టం సిద్ధయ్య నూతన ఇల్లు నిర్మాణం చేపట్టాడు. ఈనెల 19న కన్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి తనకు కూలీ పని ఇవ్వాలని అతడిని ప్రాధేయపడ్డాడు. దీంతో అదేరోజు రాత్రి శ్రీకాంత్ ఇసుక మోశాడు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా, సిద్ధయ్య ఇంట్లో ఒక్కడే నిద్రపోయాడు. శ్రీకాంత్ అదును చూసి సిద్ధయ్య దాచిన తాళాల గుత్తి తీసుకొని, బీరువాలో దాచిన రూ. 2.50 లక్షలు నగదు, 2 జతల వెండి పట్టగొలుసులు, మొబైల్ ఫోన్‌ను చోరీ చేశాడు. బయటకు వచ్చి అదే గ్రామానికి చెందిన పరిచయస్తుడు శంకరయ్య ఇంటికి వెళ్లి తన భార్య ఆరోగ్యం బాగోలేదని, ఇంటికి వెళ్లడానికి బైక్ ఇవ్వమని కోరాడు. దీంతో అపహరించిన సొమ్ము, బైక్‌తో అతడు పారిపోయాడు. మరుసటి రోజు చోరీని గుర్తించిన సిద్ధయ్య పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు చోరీ ఘటనను గోప్యంగా ఉంచడం విశేషం. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎస్సై ప్రకాష్‌నాయక్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన విషయం వాస్తవమేనన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ చేస్తే.. రూ.లక్ష మాయం

బీబీపేట: సోషల్ మీడియాలో వచ్చిన ఓ యాప్‌ను ఓపెన్ చేసి డౌన్లోడ్ చేసిన వెంటనే ఓ వ్యక్తి అకౌంట్ నుంచి డబ్బులు మాయమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేటకు చెందిన బొల్లంగారి వెంకటేష్ వాట్సప్ గ్రూపుల్లో వచ్చిన 'పీఎం కిసాన్ యోజన ఏపీకే' ఫైల్ పేరుతో రాగా దానిని ఓపెన్ చేసి డౌన్లోడ్ చేశాడు. దీంతో మొబైల్‌కి నెట్వర్క్ బంద్ అయింది. వెంటనే కొత్త సిమ్ తీసుకొని మళ్లీ యాప్‌లు అన్ని డౌన్లోడ్ చేసుకున్నాడు. ఫోన్‌పేలో బ్యాంక్ బ్యాలెన్స్ చూడగా జీరో బ్యాలెన్స్ కనపడింది. వెంటనే బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా అకౌంట్‌లో ఉన్నటువంటి రూ. 1,07,420 డబ్బులు పోయాయి. దీంతో వెంకటేష్ 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

జక్రాన్‌పల్లి: మండలానికి చెందిన ఓ యువకుడిని పోక్సో కేసులో ఏలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు జిల్లా ద్వారక తిరుమలకు చెందిన బాలికకు సదరు యువకుడు ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యాడు. అనంతరం ఆ యువకుడు మూడు నెలల క్రితం బాలికను జక్రాన్‌పల్లికి తీసుకువచ్చాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఏలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడికి కలిగోట్‌కు చెందిన సురేష్ అనే వ్యక్తి సహకరించడంతో పోలీసులు సురేష్‌ను విచారణకు రావాలని సూచించారు. సురేష్ ఏలూరుకు విచారణకు వెళ్లకపోవడంతో శనివారం ఏలూరు పోలీసులు జక్రాన్‌పల్లికి వచ్చి సురేష్‌ను అరెస్ట్ చేసి తీసుకువెళ్లారని జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపారు.